అన్యోన్యం

మాది మద్రాసుకు తొంభై మైళ్ళ దూరంలోవున్న పల్లెటూరు. ఒక సారి పనిబడితే నేను 'పట్నా'నికి వెళ్ళాను; అదే మద్రాసుకు వెళ్ళాను. అక్కడ మా బాబాయిగారింట్లో బస చేశాను.

జార్జిటౌనులోని గోవిందప్పనాయకన్ వీధిలో మా బాబాయి కాపురం. ఆయన స్కూలు మేష్టారు. నల్గురు పిల్లల కుటుంబం. చిన్న వంటగది, సుమారయిన హాలులాటిది. (దానిని మద్రాసు భాషలో 'కూటం'అంటారు) పడకగది అనబడే భోజనాలగది, బట్టలగది, అన్నీ అదే. ఆమధ్య మా పిన్నిగారి చెల్లెలికి పురుడొస్తే ఆగదే ప్రసూతి గృహం అయింది. ఈ ఒకటిన్నర గదులవాటాకు ఆయన అప్పట్లో అరవై రూపాయ లిచ్చేవాడు. ఇక బాత్‌రూమ్, పాయిఖానాల్లాటివి ఆ ఇంటిలోని ఏడువాటాల వారికి కలిపి రెండంటే రెండుండేవి. మిగతా ఆరు వాటాల్లోనూ, ఓ టాక్సీడ్రైవర్, ఓ ఘటం వాయించే అయ్యర్, ఇడ్లీలు చేసి రోజంతా తిరిగి అమ్ముకొచ్చే ఓ ముసలావిడ, పత్రికాలయంలో పనిచేసే మలయాళీ కుర్రాడు వాళ్ళమ్మ, గుడి పూజారి, కాక నటరాజన్ కుటుంబాలుండేవి, అందరివి ఒక్కొక్క గదివాటాలే; కాకపోతే కొన్నిగదులు కాస్త పెద్దవి; కొన్ని చిన్నవి. కొన్నింటికి వసారా వుండేది; కొన్నిటికి లేదు.

ఆ యిల్లు రెండుభాగాలుగా ఉండేది. ఒక్కొక్కభాగాన్ని 'కట్టు' అంటారు అక్కడ. ముందు కట్టులో మా బాబాయిది కాకుండా రెండు కాపురాలు, వెనక నాలుగుండేవి. మేడమీద ఆ ఇంటి యజమాని రామలింగం వుండేవాడు. ఆయనకు బంగారపు నగలవ్యాపారం వుండేది.

వీధిలోంచి ఇంట్లోకి సన్నగా, పొడవుగా, పది-పదిహేను గజాల నడవాలాటిది వుండేది. నడవ దాటగానే బాబాయివాటా వుండేది. నడవా పొడుగునా ఒక అరుగుండేది. అరుగు నక్కడ 'తిన్నె' అంటారు. ఆ ఇంటికి విద్యుద్దీపాలు లేవు. కాలేజిలో చదువుకునేకుర్రవాడు వీధి దగ్గరగా అరుగుమీద కూచుని వీధిదీపం వెలుతురులో చదువుకునేవాడు. ఆ ఇంట్లో పిల్లలకు ఆటస్థలం ఆ అరుగే. కూరలవాళ్ళు, పాలవాళ్ళు, బరువులు దించేది ఆ అరుగుమీదే. బయటచేరిన ఆడవాళ్లు ఆ అరుగుమీదే ఒక మూలగా ఒదిగి ఒదిగి కూర్చుంటారు. మధ్యాహ్నాలూ రాత్రిళ్ళూ, ఆ అరుగుమీదా, ఆ ఎదుట నేలమీదా నిద్రపోతుంటారు పిల్లలూ, ఏకాంతం అవసరంలేని పెద్ద వాళ్ళూ, వాటాలలో ఇమడలేని నాలాటి అతిథులకూ ఆ అరుగే పడకగది కమ్- డ్రాయింగ్ గది.

ఆ ఇంట్లో నివసిస్తున్న నలభై పై చిలుకు మనుషులంతా పాత్ర ధారులు అనుకుంటే ఆ నడవాను రంగస్థలం అనుకోవచ్చు; అ అరుగును మాడరన్ స్టేజ్‌మీది 'ఎలివేషన్' అని చెప్పుకోవచ్చు.

నే నున్న రెండు వారాలలోనూ నా పనిమీద తిరుగుతూ యెప్పుడు వీలయితే అప్పుడు ఇంటికొస్తుండేవాడిని, కొన్ని రోజులు మధ్యాహ్నం ఎండ వేళ ఇల్లుచేరి ఆ అరుగుమీద విశ్రమించేవాడిని. కొన్నిరోజులు పొద్దున్నంతా అక్కడే కూర్చుని పనిచూసుకుంటుండేవాడిని.

ఏరోజు చూచినా, ఏవేళప్పుడు చూచినా ఆ అరుగుమీద పడుకునీ కూర్చొనీ కన్పించేవాడు నటరాజన్. తాంబూలం నములుతూనో, తెలతెల పోతున్న పొడగాటి వెంట్రుకల్ని విదిలించి ముడివేసుకుంటూనో, ఎడమ అరచేతిలోని 'తంగభస్మం' పొగాకును కుడి బొటనవ్రేలితో చిదుపుతూనో, కుర్రాళ్ళను అరుస్తూనో, లేక తీరికగా వాళ్ళావిడను బండబూతులు తిడు తూనో కన్పించేవాడు.

నటరాజన్ వృత్తి పెళ్ళిళ్ళకు, పార్టీలకు వంటచేయడం. అలాటి పనులు నెలకు ఒకటో రెండో వుండేవి. పెళ్ళిళ్ళ సీజనయితే రోజుకు రెండేసి బేరాలు తగిలేవి. తడవకు పాతిక ముప్పై పుచ్చుకునేవాడు. నటరాజన్ పెళ్ళావిడ లక్ష్మిఅమ్మాళ్. అతడెంత నలుపో ఆమె అంత తెలుపు. కోలమొహం. యెత్తుపళ్ళు అతగాడికి యాభై దగ్గరుంటుంది వయసు ఆమెకు ముప్పైయారు దాటింది. ఒక కూతురు, ఇద్దరు కొడుకులు, కూతురుకి పదహారు దాటింది. మున్సిపల్ బడిలో రెండేళ్ళకొక తరగతి చొప్పున దాటుతూ యిప్పుడు ఎనిమిదవ తరగతిలోవుంది. పెద్దబ్బాయి మణి. చదువు మానేసి జులాయిగా తిరుగుతుంటాడు. వీధిలోని పేచీలను ఇంట్లోకి తీసుకొచ్చి తండ్రిచేత తన్నులు తింటూంటాడు. చిన్నవాడి పేరు ఢిల్లీ! ఒకటో తరగతికివెళ్ళి వస్తున్నాడు.

అప్పుడోసారి అప్పుడోసారిగావచ్చే నటరాజన్ సంపాదన ఇంటద్దెకూ, అతడి తాంబూలానికి సరిపోతుంది. అంచేత లక్ష్మిఅమ్మాళ్ ఒక సేఠ్ గారింట్లో రెండుపూటలా వంటచేస్తుంది. మధ్యాహ్నం భోజనంకూడా అక్కడే. నెలజీతం యాభై రూపాయలు. ఇది గాక పిండి రుబ్బినా, స్వీట్స్‌చేసినా ఒకటీ రెండూ అదనంగా వస్తుంటాయి. రోజూ ఆమె రాత్రి ఇంటికొచ్చేటప్పుడు గారో, కూరముక్కో, అరటిపండో, కొబ్బరిపచ్చడో సేఠ్ ఇంటినుండి తెస్తుంటుంది పిల్లలకోసం. పిల్లలకన్న ముందుగా అది లాక్కుని నటరాజన్ తినేయడం అరుదుకాదు. పని యెక్కువగా వున్న రోజులలో లక్ష్మి మధ్యాహ్నంపూట ఇంటికొచ్చేది కాదు. పొద్దున్నే ఇంట్లో వున్న దేదో యింత వుడకేసివెళ్ళిపోతే-రోజల్లాపనిచేసి అలసిపోయి సాయం కాలం ఏ ఏడు తర్వాతో రెండు మైళ్ళు నడుచుకుంటూ వచ్చేది.

అలా ఆమె రెండు మూడు సాయంకాలాలు నాకు బజారులో ఎదుర యింది. వాడి, వడలి, ఏతినుబండారమో ముడివేసిన పైటకొంగు ముడిని జాగ్రత్తగా పట్టుకుని నడిచి వస్తుండేది. ఒక్కసారి ఆమెబుగ్గమీద పిండి

మరక లుండేవి. అది చూచినప్పుడల్లా ఆమె యుద్ధభూమినుండి నెత్తురుమరక లతో తిరిగివస్తున్న ఝూన్సీలక్ష్మిలా అన్పించేది. రోజూ తన బిడ్డలకోసం, భర్తకోసం.ఈమె యిలా ప్రయాసపడుతుంటే - హాయిగా ఏదో ఇంత తిని తన కుంటికాలినాడించుకుంటూ, అరుగుమీద తాంబూలం నములుతూ, గప్పాలు కొడుతూ కూచున్న ఆ నటరాజన్ అంటే ఏవగింపు కలిగేది. కాని పాపం అతడు మాత్రం ఏమిచేయగలడు ?

మధ్యాహ్నంవేళయితే లక్ష్మి కిటికీలు కూడా లేని తమ వంటగది లోనే కుదికిపాట్లుపడేది. నటరాజన్ తిలాపాపమాత్రం అరుగుమీదే. రాత్రి తొమ్మిది దాటాక ఆ పొడుగాటి నడవాలో ఒకగోడవార లక్ష్మిపడుకునేది. పిల్లలూ నడవాలోనే నిద్రపోయేవారు.అలరుగుమీదా, నడవానేలమీదా చిన్నా - పెద్దా - ఆడా, మగా అంతా కలిపి పాతికమందిదాకా వారివారి ఆశలు, నిరాశలు, దురాశలు మరిచి నిద్రపోయేవారు. నూనెమరకలు అట్టలుకట్టిన ఆ తలదిండ్లు, చిరుగులకు అతుకులువేసిన దుప్పట్లు, దిండ్లకు బదులు చెక్క- పీటలు, మూటలు, దుప్పట్లకుబదులు పాతచీరలు ఆ పడకల మధ్య గుర కలు, కలవరింతలు, నిద్రరాక నిటారుగా పిశాచాల్లాలేచి చీకట్లో కూర్చుని వున్న ఒకరిద్దరు ముసలివాళ్లు-ఇది ఆ బహిరంగ నిద్రాస్థలంయొక్క సమవా కారం.

ఒకరోజు సాయంకాలం ఆరుదాటాక ఇల్లుచేరాను నేను. లోపలికి వెళ్తుండగా నటరాజన్ తమిళంలో ఘాటుగా తిడుతుండడం విన్పించింది.

"లంజ ! బజారుముండ .... దానికి ఇల్లెందుకు? సంసారంఎందుకు- - దొంగకుంక !"

ఏమిటయిందీ బోధపడలేదు. ఆ అష్టోత్తరనామాలు వాళ్ళమ్మాయి కేమో అనుకున్నా. కాని పాపం ఆ పిల్ల తలవంచుకుని ఇంట్లోకి వెళ్తూ కన్పించడంతో జరుగుతున్నపూజ ఆమెకు కాదని గ్రహించాను.

బట్టలు మార్చుకుని, కాళ్ళు చేతులూ కడుక్కుని అరుగుమీద మామూలుగాకూర్చునే చోటికి వెళ్ళి చేరగిలబడ్డాను. సైకిలుపాలవాడో స్త్రీ ఇద్దరు ముగ్గురాడవాళ్ళు పాలుపోయించుకుని వెళ్ళారు. మలయాళీ కుర్రాడు బెల్ మోగించుకుంటూ సైకిలును లోపలికి తీసుకువెళ్ళాడు. ఇంటాయన పెళ్ళాం మేడమీదనుండే వెనకవాటాలో ఎవరినో కేకేస్తూంది. వీధిదీపం వెలుతురుపడే చోట అరుగుమీదకు కాలేజివిద్యార్థి చేరాడు. చేత్తో నీళ్ళబకెట్ తో వెళ్తున్నాడు పూజారి. జేమ్స్ జాయ్స్ రాసిన 'యులిసెస్' నవలలోలావుంది వాతావరణం.

నటరాజన్ తిడుతూనే వున్నాడు తన భార్యను, వస్తూ పోతూన్న వాళ్ళందరూ ఇదేదీ వినబడనివాళ్ళలా ఎవరిపనుల మీద వాళ్ళున్నారు.

"నిన్ననగా పోయింది లంజముండ. రాత్రి కొంపకు రానేలేదు. ఏమంటే వాళ్ళింట్లో ఇవాళ పండగట, పనుందట .... మరివ్వాళ మధ్యాహ్నం తగలడొద్దూ .... లేదు. అక్కడే శుభ్రంగా పప్పులూ పిండి వంటలూ మెక్కి పడుకుంది. బజారులవిడిక్కే .... ఇవ్వాళరాత్రి కూడా పాయసం తాగి ఆ సేట్ గాడితోనే పడుకుంటుందేమో ... దంకుమరిగిన దానికి మొగుడెందుకు - పిల్లలెందుకు ...."

ఇంక అక్కడవుంటే అతణ్ణి అచెంపా ఈచెంపా వాయించేస్తానేమో అనిపించి అక్కడినుండి లేచివెళ్ళిపోయాను. అపక్కవీధిలోని ఉడయివర్ల గుడికెళ్ళి ఓగంట కూచుని వచ్చాను. నేను యింటికొచ్చేసరికి తొమ్మిదయింది.

పిన్నిభోజనం వడ్డించింది. ఇంటిలోని అన్ని వాటాలనుండి సంసార నాదాలు గందరగోళంగా - రిపేర్ చేయబడుతున్న రేడియోలోని రణగొణ ధ్వనులలాగా వినబడుతున్నాయి.

నామనస్సు అడుగుతోంది. - 'లక్ష్మి ఇంటికి వచ్చిందా? పాపం ఆమెను గాని ఈ ధూర్తుడు కొట్టాడేమో -'

చెవులు వాళ్ళవాటానుండి వచ్చేశబ్దాలకోసం యెదురుచూస్తూ కాచు న్నాయి. చేతులు కడుక్కుంటుంటే -

హఠాత్తుగా వినబడింది —— ''ఆసేఠ్ పెళ్ళానికి పక్షవాతం కాదుటే - వాడు నిన్న మరిగాడు. అందుకనే ....''

"నోరుముయ్యండి, ఎవరన్నా వింటారన్న సిగ్గయినాలేదు మీకు? ఎదిగిన పిల్లల తల్లిని - రెండ్రోజులు చచ్చేట్లు పనిచేసి శవంలా వస్తుంటే నోటికొచ్చినట్లు మాట్లాడతారేం? .... ఆకలయితే చిన్నబిడ్డకన్నా చేటుమీరు. —— ఇదిగో ఆ డబ్బాలలో బూరెలు, ఇదిగో పాయసం తీసుకోండి .... చిన్నబిడ్డలయితే ఆకలికి ఏడుస్తారు - మీరు మాత్రం వెధవ నోటికి వచ్చినట్లల్లా కారుకూతలు కూస్తారు - ముందిది తిని వెళ్ళండి." అన్నలక్ష్మి గొంతులో పలికిన రసాలు ఎన్నో చెప్పడానికి లక్షణ గ్రంథాలులేవు. అందులో అనుబంధం వుంది. ఆగ్రహంవుంది. ఆవేదన వుంది. అడియాసవుంది. ఆప్యాయతవుంది.

నేను వెళ్ళి అరుగుమీదపడుకున్నాను.

ఏమి మనుష్యులు, ఏమి జీవితాలు - అని మనసులో పరిపరివిధాల ఆలోచిస్తుండగా యెప్పుడో నిద్రపట్టేసింది.

ఏఅర్థరాత్రప్పుడో నిద్రలో స్వప్నమో, మెలకువలో నిజమో కానీ - "ఉష్, ష్" అని యెవరో అంటున్నట్లు విన్పించింది.

" - ష్ - లేవు!"

"................ ఊఁ!"

నా నిద్రపోయింది. కళ్ళింకా మూసుకునే విన్నాను. చెవులుమాత్రం పూర్తిగా'అటెన్షన్'లో వున్నాయి.

"రావేఅంటుంటే వినపడడంలేదా...."

"అబ్బా ...." మత్తుగా మూలుగు.

"జాన్లే .... నీకెందుకూ .... వాడితో సరిపోయె విన్నంతా -" ఆ వాక్యం ముగియకుండా హఠాత్తుగా ఆగింది.

కళ్ళు తెరచీ తెరవక దొంగతనంగా చూశాను.

చీకటి.

"నిజంచెపుతే నోరుమూస్తావుటే -" నెమ్మదిగానేవుంది కాని స్పష్టంగావుంది స్వరం.

"నోరుమూసుకుంటారా లేక మూయమంటారా?"

మూస్తావ్ మూస్తావ్ ...."

ఛస్ - వెధవగొడవ! కాస్త నిద్రపోపోదామంటేనీకుండా ...."

"రా మరీ .... నిద్రపోదాం ...."

పెద్దగా ఆవలింత.

నిముషం తర్వాత నటరాజన్ కుంటుతూ తమ వాటావైపు నడిచాడు. వెనకాలే జుత్తు ముడివేసుకుంటూ, నిద్రమత్తుతో బద్ధకంగా వెళ్ళింది లక్ష్మి.

ఇది జరిగి ఇరవైయేళ్ళు దాటింది.

ఢిల్లీలో ఉద్యోగం చేస్తున్నానిప్పుడు.

సత్‌నగర్‌లో మా ఇంటిముందు నిలబడ్డానో ఆదివారం సాయంకాలం.

తలకు నీళ్ళుపోసుకున్న సర్దార్జీలు జుత్తువిరబోసుకుని, ఖుషల్గా వున్నారు. వారిభార్యలో తల్లులో, చెల్లెళ్ళో, వాళ్ల జుత్తుకు నూనెరాచి దువ్వుతున్నారు. వీధిలో మంచాలమీద కూచుని.

హఠాత్తుగా ఎక్కడనుండో పరుగెత్తుకొచ్చింది ఒక నల్లకుక్క. దాని నోటిలో చపాతీముక్కవుంది.

దాన్ని తరుముతూవచ్చింది ఇంకొక చారల శునకం.

రెండూ కలియబడ్డాయి, చపాతీని చారలకుక్క లాక్కుంది.

నల్లకుక్క తోకాడిస్తూనిల్చుంది.

చపాతీ తినడం అవగానే చారలకుక్క వదనం ప్రసన్నమయింది.

అది నల్లకుక్క దగ్గిరగావచ్చి దానిమూతినీ ఒళ్లునీ నాకసాగింది.

నల్లకుక్క సిగ్గుతో, సంతోషంతో ఏడిపించసాగింది.

కాస్సేపుతర్వాత అవిరెండు ఒకదాని వెంబడి ఒక్కటిగా వెళ్ళిపోసాగాయి.

ముందుగా చారలకుక్క; వెనుకగా నల్లకుక్క!

మనస్సు ఇరవైయేళ్ల క్రిందకు గెంతింది!

★